నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
గురువారం
20 ఫిబ్రవరి
2025
పేజీలు 8
గుంటూరు
పల్నాడు





## మిర్చి రైతులను దళారులకు అమ్మేసింది

# చంద్రబాబే..!



- కష్టాలు కనిపిస్తున్నా కళ్లు మూసుకున్న ప్రభుత్వం
- ప్రభుత్వంపై ధ్వజమెత్తిన మాజీ సీఎం వై.ఎస్. జగన్
- మిర్చియార్డులో మిర్చి రైతులను కలిసిన జగన్
- రైతులతో ముఖాముఖి. సమస్యలపై ఆరా

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

తెగుళ్లతో రాష్ట్రంలో మిర్చి దిగుబడి తగ్గింది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో మద్దతు ధర పడిపోయింది. రాష్ట్రంలో ఇప్పుడు ఏ పంటకు మద్దతు ధర లేదని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సర్కారు విధానాలపై తూర్పారబట్టారు. బుధవారం గుంటూరు మిర్చి యార్డుకు వచ్చిన జగన్ రైతుల సమస్యలు తెలుసుకుని వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను దళారులకు సీఎంచంద్రబాబు అమ్మేశారని ఫైర్ అయ్యారు. వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయానికి పెద్దపీటవేసి రైతుల జీవితాల్లో వెలుగులు నింపాం అన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులను చేయి పట్టుకుని నడిపించాం, విత్తనం మొదలు పంటల అమ్మకం వరకు తోడుగా ఉన్నాం, 5 ఏళ్లలో రూ.65వేల కోట్లతో ధాన్యం కొనుగోలు చేశాం అని జగన్ గుర్తు చేశారు. ఈ ప్రభుత్వంలో పంటలకు మద్దతు ధర లేదు. నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా లేదు, కూటమి ప్రభుత్వంలో ప్రతి వ్యవస్థ నిర్వీర్యం చేసింది. రైతులకు పెట్టుబడి సాయం అందించాలి, వెంటనే మిగతా 3వ పేజీలో



## తూనికలు, కొలతల శాఖకు

# కో కొల్లలుగా తూట్లు..!

చట్టం ఎంతో బలంగా ఉన్నప్పటికీ దాన్ని అమలు చేసే అధికారులు బాధ్యతారహిత్యంగా వ్యవహరించటం వలన దానికి. తూట్లు పడుతున్నాయి. ఈ పరిస్థితి నేడు తూనికలు కొలతల శాఖలో ఏర్పడింది. ఈ చట్టానికి అవినీతి మరకలు అంటుకుంటున్నా అధికారులు మాత్రం పట్టీ పట్టనట్లువ్యవహరిస్తున్నా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నరసరావుపేట, తెనాలి, సత్తెనపల్లి, గుంటూరు, మంగళగిరి, పొన్నూరు, సత్తెనపల్లి, మాచర్ల, పిడుగురాళ్లతో తో పాటు పలు పట్టణ, మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో. నిత్యావసర వస్తువుల తూకాల్లో ఏడా పెడ మోసాలుజరుగుతున్నాయి. ఈ శాఖ అధికారులకు లంచాల మీద ఉన్న యావ విధులపై చూపడం లేదు. నామమాత్రంగా కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారు. సిబ్బంది కొరతను బూచిగా చూపి మోసం చేసే వ్యాపారుల వద్ద కాసులు దండుకొని దర్జాగా జేబులు నింపుకుంటున్నారు. వ్యాపారులపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే గోప్యత పాటించాల్సిన అధికారులు ఆ వివరాలను బయటపెడుతున్నారు. దీనివల్ల వ్యాపారుల మోసాలను వెల్లడించాలంటేనే వినియోగదారులు భయపడిపోతున్నారు. ఎవరైనా అధికారి నిక్కచ్చిగా వ్యవహరిస్తే వారిని బదిలీ చేయించడం లేదంటే సస్పెండ్ చేయడం జరుగుతోంది. ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది..

- గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

- పెట్రేగిపోతున్న చట్టం ఉల్లం ఘనలు
- నామమాత్రంగా కేసులు నమోదు
- ఫిర్యాదుదారుల గోప్యత లీక్
- అన్నింటిలో మోసాల దందా

మనం ప్రతినిత్యం ఎన్నో రకాల వస్తువులను మార్కెట్లో కొనుగోలు చేస్తూ ఉంటాం. తూకం, కొలతలు ఏవైనా కావచ్చు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో తూనికలు, కొలతలు కొంతమంది వ్యాపారులు వినియోగదారులను దగా ఆ శాఖ అధికారులు మాత్రం పట్టీ పట్టణట్లు వ్యవహరిస్తున్నారు తూనిక లేదా కొలత విషయంలో ఏ విధమైన మోసానికి గురి కాకుండా నాణ్యమైన వస్తువులను పొందేహక్కు వినియోగదారులకుఉంది. ఇది వినియోగదారుల ప్రాథమిక హక్కు కూడా. కానీ మిగతా 3వ పేజీలో

## జిపిఎస్ వ్యాధితో

# మరొకరు మృతి

**గుంటూరు వైద్యం, మేజర్ న్యూస్**

ప్రభుత్వాసుపత్రిలో జిబియస్ వ్యాధితో చికిత్స పొందుతున్న షేక్ గౌహర మంగళవారం రాత్రి మృతి చెందాడు. నాలుగు రోజుల క్రితం వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రి లో చేరాడు. ఇప్పటికే ఈ వ్యాధి తో ఒకరు మృతి చెందగా తాజాగా మరొకరు మృతి చెందారు.. ప్రస్తుతం మరో ముగ్గురు ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నారు. వైద్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్తున్నాప్పటికీ సకాలంలో వైద్యం అందక వ్యాధి బారిన పడ్డ పేషెంట్లు రెండు రోజులు అవదులోనే ఇద్దరు చనిపోవడం సంచలనంగా మారింది అధికారులు లెక్కల ప్రకారం ఇద్దరు చనిపోయినట్లు ప్రభుత్వ వైద్యశాల ధ్రువీకరిస్తున్నప్పటికీ అనధికారకంగా ఎంత మంది చనిపోయారు అనేది ఇప్పటికి గణంకాలు బయటికి రాకపోవడం ఆందోళన కలిగిస్తున్న అంశంఈ వ్యాధి నివారణ కోసం ఇంజక్షన్లు అందుబాటులో ఉన్న రోగులను సకాలంలో వైద్యం అందించక పోవడం వల్లే మృతి చెందారని మృతుని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

## 8 సీసీ కెమెరాలను ఓల్డ్ గుంటూరు సీఐకి అప్పగించిన కిమ్స్ శిఖర హాస్పిటల్

### సామాజిక బాధ్యతలో మేము సైతం అంటున్న కిమ్స్ శిఖర హాస్పిటల్





**గుంటూరు మేజర్ న్యూస్ :** సామాజిక బాధ్యతలో భాగంగా గుంటూరు నగరాభివృద్ధిలో భాగంగా తాము సైతం తమ వంతుకు సహకారం అందిస్తామని కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ అద్విక్ బొల్లినేని కిమ్స్ శిఖర రీజనల్ సి ఓ ఓ సుధాకర్ జాదవులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రైమ్ రేటు తగ్గించడానికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీసీ కెమెరాలు ఏర్పాటులో భాగంగా తాము కూడా 8 సీసీ కెమెరాలను పోలీసుల సూచనలు మేరకు ఏర్పాటు చేసినట్లుగా వారు పేర్కొన్నారు. గుంటూరు కాకాని రోడ్, మంగల్దాస్ నగర్ లో ఉన్న కిమ్స్ శిఖర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 8 సీసీ కెమెరాల సర్వేలెన్సును బుధవారం ఓల్డ్ గుంటూరు పోలీసులకు కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ అద్విక్ బొల్లినేని కిమ్స్ శిఖర రీజనల్ సి ఓ ఓ సుధాకర్ జాదవులుఅప్పగించారు. ఓల్డ్ గుంటూరు పోలీసు స్టేషన్ పరిధిలో మల్టీస్పెషల్టి కేర్ హాస్పిటల్ గా సేవలందిస్తున్న కిమ్సికర్ హాస్పిటల్ సామాజిక బాధ్యతలో నూ అగ్రభాగంలో నిరుస్తున్నట్లుగా సంస్థ నిర్వాహకులు విలేకరులతో తెలిపారు. తమ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఈ సందర్భంగా కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ అద్విక్ బొల్లినేని తెలిపారు. సీసీ కెమెరాలను ఓల్డ్ గుంటూరు ఇన్స్పెక్టర్ వై.వి సోమయ్య, ఎస్సైలు ఎన్ సి ప్రసాద్, ఎస్ కె అబ్దుల్ రెహమాన్ల ను కలిసి అప్పగించారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఓల్డ్ గుంటూరు సీఐ సోమయ్య హాస్పిటల్ నిర్వాహకులను అభినందించారు.

## పట్టభద్రుల మద్దతు అలపాటికే : ఎమ్మెల్యే గళ్ళ మాధవి

**గుంటూరు, మేజర్ న్యూస్ :** ఉమ్మడి కృష్ణా – గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కే పట్టభద్రుల మద్దతు ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళ మాధవి తెలిపారు. బుధవారం గుంటూరు 35వ డివిజన్ కృష్ణనగర్ లోని లోటస్ ఆద్యా స్కూల్ లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి, అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ లు ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గుంటూరు తూర్పు, పశ్చిమల్లో ఉన్న ప్రైవేటు స్కూళ్ళ ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటును ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కు వేసి గెలిపించాలని కోరారు. యువత, ఉపాధ్యాయ మరియు పట్టభద్రుల మద్దతు ఆలపాటికే ఉందని, సుధీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఆలపాటి ఖచ్చితంగా పట్టభద్రుల తరపున గొంతుక గట్టిగా వినిపిస్తారని, గతములో గెలిచిన అభ్యర్థులు లాగా రబ్బర్ స్టాంప్ మాదిరిగా ఉండరని ఎమ్మెల్యే గళ్ళ మాధవి ధీమా వ్యక్తం చేశారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీరందరు వేసే ఓటు, ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి మద్దతుగా అని విషయం గుర్తించుకోవాలని, యువత, ఉపాధ్యాయులు ఎదురుకుంటున్న సమస్యలను ప్రభుత్వము దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరిస్తారని, మీరందరూ సమిష్టిగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో ఈరంటి వర ప్రసాద్, జెట్టి బాబు, కన్నా మాస్టారు, మేకల రవీంద్రబాబు, పెండ్యాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## రొంపిచర్లలో కోతికి అంత్యక్రియలు



**నకరికల్లు, మేజర్ న్యూస్ :** నరసరావుపేట నియోజకవర్గం మండల కేంద్రమైన రొంపిచర్లలో వింత సంఘటన జరిగింది. అనారోగ్యంతో మృతి చెందిన కోతికి గ్రామస్తులు అంత్యక్రియల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి మాజీ ఎంపీటీసీ పడాల నాగిరెడ్డి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆదరణ-3 పథకాన్ని మళ్ళీ తెస్తున్న సీఎంకు ధన్యవాదాలు

### బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

వెనుకబడిన తరగతుల కుల వృత్తులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఆదరణ-3 పథకాన్ని పునరుద్ధరిస్తున్నందుకు, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఒక ప్రకటనలో బీసీ సమాజం తరపున సీఎం చంద్రబాబు నాయుడు కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈసారి ఈ పథకం ద్వారా వృత్తిదారులకు మరింత మేలు జరిగేలా రూపొందించి,నిర్దిష్ట ప్రణాళిక ద్వారా పకడ్బందీగా అమలు చేసేలా అధికారులను ఆదేశించాలన్నారు. ప్రతి కులవృత్తికి ఆధునికతను జోడించి, పని సులభతరం చేయడంతో పాటు, ఆదాయాన్ని పెంచేలా కొత్త పరికరాలను అందించాలన్నారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా ఆధునిక ఉపకరణాలను సమీకరించి,ఎంపిక చేస్తున్న లబ్ధిదారులందరికీ అందించి,వాటిని కచ్చితంగా వాడుకునేలా, ఆదాయాన్ని పెంచు కునేలా ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. పనిముట్ల వాడకం పైన,రుణ సదుపాయాలకు సంబంధించిన అంశాల పైన,వృత్తి కార్మికులకు సంపూర్ణ అవగాహన కలిగించేందుకు రాష్ట్రస్థాయి లోనూ, ప్రతి జిల్లా స్థాయిలోనూ అవగాహన సదస్సుల పేరిట వర్క్ షాపులు ప్రభుత్వమే నిర్వహిం చాలన్నారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్,వివిధ కుల కార్పొరేషన్ల ద్వారా వృత్తిదారులకు సబ్సిడీ రుణాలు అందించి, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలన్నారు.



ఎన్నికల హామీ మేరకు ఏడాదికి రూ 30,000 కోట్లు,సబ్ ప్లాన్ మేరకు బడ్జెట్లో నిధులను బీసీ సంక్షేమ శాఖకు కేటాయించాలన్నారు. అలాగే బీసీల స్వయం ఉపాధికి రూ:10 వేల కోట్లు, వృత్తిదారులకు సంబంధించిన ఆదరణ-3 పథకాన్ని పునరుద్ధరించి, దానికి రూ:5 వేల కోట్లు బడ్జెట్లో కేటాయించా లన్నారు. ఆయా కులాల వారి జనాభా మరియు పేదరికాల దామాషా మేరకు అన్ని బీసీ కుల కార్పోరేషన్లకు బడ్జెట్లో నిధులు కేటాయిం చాలని కేసన కోరారు. యాదవులు /కురబలకు అత్యాధునిక ప్రమాణాలతో గొర్రెల పెంపకం జరిగేలా, రాయితీ లతో గొర్రెల యూనిట్లను, బీమా సౌకర్యంతో సహా అందించాలన్నారు. చేనేత కుటుంబాలకు వారి ఉత్పత్తులపై జీఎస్టి లేకుండా పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు-హ్యాండ్ లూమ్స్ కు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తూ చేదోడుగా ఉండాలన్నారు. దేవాలయాల్లో పనిచేసే నాయి బ్రాహ్మణులకు రు:25వేల గౌరవ వేతనంతో పాటు, షాపులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలని వారు కోరారు. వడ్డెరలకు క్వారీల్లో 20 శాతం రిజర్వేషన్లతో రాయల్టీగా, సీనరీ చార్జీలో మినహాయింపు ఇవ్వాలన్నారు. రజక వృత్తిదారుల ఇస్త్రీ షాపులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తుతో పాటు, ఆయా ప్రాంతాలకు తగినట్లు ధోబి ఘాట్లు ఆధునిక హంగులతో నిర్మించాల న్నారు. స్వర్ణకార వృత్తిదారుల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలలో స్వర్ణకార ఫైనాన్స్ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, తగినన్ని నిధులు కేటాయించాలన్నారు. బీసీలకు ఇకపై శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. ఎన్నికల ప్రణాళికలో ప్రకటించినట్లు, గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపుల్లో 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చినందుకు శంకరరావు సీఎం చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు.

## బహుజన ప్రజ్ఞశాలి "ఉ సా" : మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్

**గుంటూరు మేజర్ న్యూస్ :** ఉద్యమాల ఉపాధ్యాయులు బహుజన మేధావి ప్రత్యామ్నాయ రాజకీయ సిద్ధాంత ప్రతిపాదకులు (ఉసా) ఉప్పు మావులూరి సాంబశివరావు 74వ జయంతి కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు అధ్యక్షతన స్థానిక అరండల్ పేట నందు గల అమరావతి బుక్ హౌస్ నందు ఉ సా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించడమైనది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ఉప్పుమావులూరు సాంబశివరావు గొప్ప సామాజిక ఉద్యమకారులని బహుజన ప్రజ్ఞశాలని ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతో ఉందని పేర్కొన్నారు. బహుజన



మహాసభ అధ్యక్షుడు జి ఆర్ భగత్ సింగ్ మాట్లాడుతూ పేద వర్గాల కోసం జీవిత కాలంతాను నమ్మిన సిద్ధాంతం తో లెనిన్ అంబేద్కర్ జ్యోతిరావు పూలే ఆలోచన విధానంతో పేదలకు రాజ్యాధికారం దక్కాలనే ఏకైక లక్షణతో అలుపెరగని పోరాటం చేసిన గొప్ప ఉద్యమాల ఉపాధ్యాయులు ఉ సా అని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు మాట్లాడారు. ఘన నివాళులు అర్పించి ప్రసంగించిన వారిలో పూలే అంబేద్కర్ పెరియార్ గుర్రం జాషువా లిటరేచర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బత్తుల విల్సన్ రజకజన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి వేల్పూరి నరసింహారావు ఆర్.పి.ఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి విప్పర్ల ముత్తయ్య మాల మహానాడు నాయకులు బి అనిల్ బాబు భీమ్సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం బీఎస్పీ నాయకులు గంగోలు శామ్యూల్ నాయీబ్రాహ్మణ జేఏసీ గుంటూరు అర్బన్ కమిటీ అధ్యక్షులు మల్లాది నాగేశ్వరరావు సౌందర్య సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు పెద్దప్రోలు శ్రీమన్నారాయణ సహాయ కార్యదర్శి నాగులవంచ రవీంద్ర తదితరులు ఉన్నారు

## విజ్ఞాన్స్ యూనివర్సిటీ - బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీల మధ్య అవగాహన ఒప్పందం

**చేబ్రోలు, మేజర్ న్యూస్ :** చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ – యూఎస్ఏ – ఓహియోలోని బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీల (బీజీఎస్‌యూ) మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ బుధవారం తెలిపారు. యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ ప్రమోషన్స్, కొలాబరేషన్స్ అండ్ ఫ్యాకల్టీ అఫైర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూఎస్ఏ – ఓహియోలోని బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ ఇంటిరిమ్ వైస్ ప్రోవోస్ట్ ప్రొఫెసర్ రామ్ వీరపనేని, ఆర్కిటెక్చర్ అండ్ అప్లైడ్ ఇంజినీరింగ్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ వేల్ మోక్తర్‌తో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన తమ యూని వర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు బీజీఎస్‌యూ తో కలిపి జాయింట్ డిగ్రీలను అందజేయ వచ్చునన్నారు. ఉదాహరణకు తమ యూనివర్సి టీలో బీటెక్ చదువుతున్న విద్యార్థి 3 సంవత్సరాలు పాటు ఇక్కడ చదివి, 4వ సంవత్సరం కోర్సును బీజీఎస్‌యూలో చదవచ్చునన్నారు.



బీజీఎస్‌యూలో వచ్చే క్రెడిట్స్‌ను ఆధారంగా చేసుకుని తమ యూనివర్సిటీ విద్యార్థికి యూజీ డిగ్రీను అందజేస్తామన్నారు. ఒకవేళ అదే విద్యార్థి 5వ సంవత్సరం కూడా బీజీఎస్‌యూలో ఉంటే వారికి బీజీఎస్‌యూ మాస్టర్స్ డిగ్రీను అందజేస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా యూఎస్ఏలో అక్కడే మరో మూడు సంవత్సరాలు పాటు ఉద్యోగం చేసుకోవడానికి కూడా అవకాశం లభిస్తుందన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ అధ్యాపకలు, బీజీఎస్‌యూ అధ్యాపకులు కలిసి సంయుక్తంగా పరిశోధనలు, ప్రాజెక్టులు, ల్యాబ్‌లను కలిసి నిర్వహించుకుని సౌలభ్యం లభిస్తుందన్నారు. విద్యార్థులకు సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లు లభించే అవకాశం ఉందన్నారు. ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవాన్ని అందించడంతో పాటు వృత్తిపరమైన వృద్ధిని పెంపొందిస్తామన్నారు. ప్రస్తుతం పరిశ్ర మలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామన్నారు. అంతేకాకుండా విద్యార్థులకు వచ్చే స్టార్టప్ ఐడియాలను టెస్ట్ చేసుకోవచ్చునని తెలియజేసారు. ఈ సందర్భంగా యూఎస్ఏ- ఓహియోలోని బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ ఇంటిరిమ్ వైస్ ప్రోవోస్ట్ ప్రొఫెసర్ రామ్ వీరపనేని మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదనివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో యూఎస్ఏ – ఓహియోలోని బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ ఆర్కిటెక్చర్ అండ్ అప్లైడ్ ఇంజినీరింగ్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ వేల్ మోక్తర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ టెక్నాలజీ ప్రొఫెసర్ శ్రీ కొల్ల, ఇంటర్నేషనల్ స్టూడెంట్ అడ్వైజర్ డాక్టర్ కెన్ (జాన్), విజ్ఞాన్స్ యూనివర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కోళ్లలో బర్డ్ ఫ్లూపై అవగాహన కల్పించండి : జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

ఇతర జిల్లాలలో బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ వినియోగంపై ప్రజల్లో ఉన్న ఆందోళనలు, అపోహలు తొలగించేలా పశుసంవర్ధక శాఖ, పౌల్ట్రీ ఫార్మర్స్ సమన్వయంతో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఇతర జిల్లాలలో కోళ్ళకు బర్డ్ ఫ్లూ వ్యాధి నేపథ్యంలో పశు సంవర్ధక శాఖ అధికారులు, ఏపీ పౌల్ట్రీ ఫార్మర్స్ ఫెడరేషన్ సభ్యులతో సమావేశం అయ్యారు. జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ గారికి జిల్లాలో బర్డ్ ఫ్లూ పరిస్థితులపై పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి , పౌల్ట్రీ ఫార్మర్స్ సమాఖ్య సభ్యులు వివరాలు తెలుపుతూ జిల్లాలోని పౌల్ట్రీ ఫామ్స్ లో బర్డ్ ఫ్లూ కి సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి కేసులు నమోదు కాలేదని, కోళ్ళకు బర్డ్ ఫ్లూ సోకకుండా ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పౌల్ట్రీ ఫారమ్స్ లో బయో సెఫ్టీ ప్రోటోకాల్స్ అమలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ సోకిన ప్రాంతాలలో కిలో



మీటరు పరిధిలోని పౌల్ట్రీ పారమ్స్ లోని కోళ్లను పూర్తిగా నాశనం చేటయం తో పాటు, పది కిలోమీటర్లు పరిధిలోని పౌల్ట్రీ ఫారమ్స్ లోని కోళ్ళ రవాణాను పూర్తి గా నిలిపి వేశారన్నారు. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ పరిస్థితి అదుపులో ఉన్నా సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారం వలన చికెన్, కోడిగ్రుడ్లు వినియోగం గణనీయంగా పడిపోయిందని తెలిపారు. చికెన్, క్రోడి గుడ్డు పూర్తిగా ఉడికించటం వలన వైరస్‌లు నాశనం అవుతాయని, వాటిని తినటం వలన ఎటువంటి వైరస్ సోకదని సురక్షితమని వైద్యులు నిర్ధారించారన్నారు. ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు పశుసంవర్ధక శాఖ, వైద్యారోగ్యశాఖతో కలసి ఏపీ పౌల్ట్రీ ఫార్మర్స్ ఫెడరేషన్ ఫిబ్రవరి 21వ తేదిన చికెన్, ఎగ్ మేళాను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ పై ప్రజల్లోని ఆందోళనలు , అపోహలు తోలిగేలా పశు సంవర్ధక శాఖ, వైద్యారోగ్యశాఖ సమన్వయంతో పౌల్ట్రీ పార్మర్స్ సహకారంతో విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చికెన్, ఎగ్ మేళా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బర్డ్ ఫ్లూ వైరస్ కట్టడికి ముందస్తుగా ప్రభుత్వం సూచించిన బయో సెఫ్టీ ప్రోటోకాల్స్ ను పౌల్ట్రీ ఫారమ్స్ లో ఖచ్చితంగా అమలు జరిగేలా పశుసంవర్ధక శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా. ఓ నరిసింహారావు, ఏపీ పౌల్ట్రీ ఫార్మర్స్ ఫెడరేషన్ చైర్మన్ వై.సురేష్, సభ్యులు నాగేశ్వరరావు, కె.గిరిధర్, కిషోర్, వెంకయ్య, రాంబాబు, కిరణ్, జాకీర్ పాల్గొన్నారు.

# మిర్చి రైతులను దళారులకు అమ్మేసింది చంద్రబాబే..!

(మొదటి పేజీ తరువాయి)

కనీస మద్దతు ధరలు ప్రకటించాలి, రైతులను ఆదుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని జగన్ హెచ్చరించారు. కనీస మద్దతు ధర కూడా దక్కక, తీవ్రంగా నష్టపోతూ నానా అగచాట్లు పడుతున్న మిర్చి రైతులకు అండగా నిలుస్తూ, గుంటూరులోని మిర్చియార్డును మాజీ సీఎం, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించారు. యార్డులో మిర్చి రైతులను కలుసుకున్న ఆయన, వారి సమస్యలు, అగచాట్లు ఆరా తీశారు. ఒకవైపు రైతులు, మరోవైపు పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలి రావడంతో గుంటూరు మిర్చియార్డు క్రిక్కిరిసి పోయింది. అయితే ఆ స్థాయిలో మిర్చి యార్డు ప్రాంతం అంత సందడిగా మారినా, సాక్షాత్తూ మాజీ సీఎం అక్కడ పర్యటిస్తున్నా.. ప్రభుత్వం కనీస భద్రత చర్యలు చేపట్టలేదు. పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేయలేదు. వైయస్ జగన్ గుంటూరు పర్యటనలో అడుగడుగునా, ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపించింది. కష్టాల్లో ఉన్న తమను పరామర్శించేందుకు వచ్చిన జగన్‌ను చూసిన మిర్చి రైతులు, తమ గోడు వెళ్లబోసుకున్నారు. బాధలు చెప్పుకున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో పడుతున్న కష్టాలను మిర్చి రైతులు వివరించారు. వారి కష్టాలు, బాధలు సావధానంగా విన్న ఆయన, వారికి ధైర్యం చెప్పారు

**కళ్లు మూసుకున్న సీఎం:**

రాష్ట్రంలో రైతుల కష్టాలను సీఎం చంద్రబాబు అస్సలు పట్టించుకోవడం లేదు. సచివాలయానికి, సీఎం ఇంటికి కూతవేటు దూరంలో ఉన్న గుంటూరు మిర్చియార్డులో రైతులు పడుతున్న అవస్థలు చంద్రబాబు నాయుడుకి అర్థం కావడం లేదు. ఆయనకు రైతుల కష్టాలు కనిపించినా కళ్లు మూసుకున్నారు. వారిని మరిన్ని కష్టాల పాల్జేస్తున్నారు. గుంటూరు మిర్చియార్డులో ఇప్పుడు మిర్చి పంటకు కనీసం రూ.10 వేలు, రూ.11 వేల ధర కూడా రావడం లేదు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకోలేని పరిస్థితుల్లో రైతులు ఉన్నారు.

**తగ్గిన దిగుబడి.. రాని గిట్టుబాటు ధర:**

ఒకవైపు తెగుళ్ల తాకిడితో మామూలుగా 20 క్వింటాళ్లకు పైగా రావాల్సిన దిగుబడి కాస్తా ఇవాళ 10 క్వింటాళ్ల నుంచి 15 క్వింటాళ్లకు పడిపోయింది. మరోవైపు గత ఏడాది వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.21 వేల నుంచి రూ.27 వేలు ధర పలికిన మిర్చిని ఇవాళ కనీసం రూ.10 వేల నుంచి రూ.11 వేలకు కూడా కొనే నాథుడు



లేకుండా పోయాడు. రైతులకు పెట్టుబడి కింద కనీసం రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలు ఖర్చు అవుతుంది. అటు తెగుళ్లతో తగ్గిన దిగుబడి. ఇటు రేటు లేక అమ్ముకోలేని పరిస్థితులతో రైతులు బ్రతుకు దుర్భరంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా కందులు, పెసర, మినుములు, టమోట, ప్రతి ఇలా ఏ పంట తీసుకున్నా రైతులకు గిట్టుబాటు ధర రాని పరిస్థితి నెలకొంది.

**రైతులను అమ్మేసిన చంద్రబాబు :**

రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు రైతులను దళారీలకు అమ్మేశాడు. పంటలకు మద్దతు ధర రావడం లేదు. మరోవైపు వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల జీవితాల్లో వెలుగులు చూద్దానికి ప్రవేశపెట్టిన సంస్కరణలు ఏవీ ఈరోజు కనిపించడం లేదు. గ్రామాల్లో ఆర్బీకే వ్యవస్థ, ఈ–క్రాప్ విధానం నిర్వీర్యం అయిపోయాయి. దీంతో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది.

**రైతులకు అండగా వైయస్సార్‌సీపీ ప్రభుత్వం:**

గతంలో గ్రామాల్లో రైతులను చేయి పట్టుకుని నడిపించేలా ఆర్బీకేల ద్వారా పంటల కొనుగోలు జరిగేవి. ఈ%–%క్రాప్ కింద నమోదు చేసుకున్న ప్రతి రైతుకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా, ఆర్బీకేల్లో పోస్టర్లు కనిపించేవి. గిట్టుబాటు ధరల కంటే తక్కువ రేటుకు ఏ రైతు తన పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చేది కాదు. ఒకవేళ అలా అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏ రైతుకైనా వస్తే.. ఆ రైతు ఆర్బీకేకి వచ్చి రిజిస్టర్ చేసుకుని, టోల్‌ఫ్రీ నెంబర్ 1907 కు ఫోన్ చేస్తే చాలు వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆ రైతుల నుంచి పంటలను కొనుగోలు చేసేది.

ఆ రోజుల్లో ధాన్యం సేకరణకు ప్రభుత్వం రూ.65 వేల కోట్లు ఖర్చు చేసి రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించే ప్రయత్నం చేస్తే.. ఇవాళ ధాన్యం కొనుగోళ్లలో ఏ రైతుకూ కనీస గిట్టుబాటు రాలేదు. గత వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.7 వేల కోట్లకు పైగా ఖర్చు చేసి ప్రతి రైతునూ ఆదుకున్నాం.

**కూటమి ప్రభుత్వంలో ప్రతి వ్యవస్థ నిర్వీర్యం:**

ఇవాళ రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించాలన్న ఆలోచన లేదు. ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలన్న ఆలోచన లేదు. ఒక నెంబరుకు ఫోన్ చేస్తే ప్రభుత్వం స్పందిస్తుందన్న నమ్మకం రైతులకు కనిపించడం లేదు. ఆర్బీకేలు, వాటికి అనుసంధానంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లతో సహా ప్రతి వ్యవస్థ నిర్వీర్యం అయిపోయింది.గతంలో ఎవరైనా కల్తీ విత్తనాలు అమ్మాలనుకుంటే ప్రభుత్వం ఉందని భయపడే పరిస్థితి నుంచి ఇవాళ ప్రభుత్వమే యథేచ్ఛగా దగ్గరుండి ఆర్బీకేల ద్వారా ఎరువులు, విత్తనాల సరఫరా నిలిపివేసే కార్యక్రమం చేసింది. ఇవాళ రైతులు ఎరువులు కొనాలంటే ప్రైవేటు డీలర్ల దగ్గర కొనాల్సి వస్తుంది. వాళ్లు కనీసం రూ.100 నుంచి రూ.400 అధికంగా బ్లాకులో అమ్ముతున్నారు. క్వాలిటీ కంట్రోల్ చేసే విషయంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. గతంలో ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అమ్మే పరిస్థితి ఉంటే.. ఇవాళ నాణ్యమైనవేవీ రైతులకు రాకుండా పోతున్న పరిస్థితి నెలకొంది. పెట్టుబడి సాయం కింద పీఎం కిసాన్ కాకుండా ప్రభుత్వం తాము ఇస్తామన్న రూ.20 వేలు ఇవ్వకుండా రైతులను మోసం చేసింది. రైతులకు సున్నావడ్డీ కూడా రావడం లేదు.

**రైతులను ఆదుకోకపోతే తీవ్ర పరిణామాలు :**

రైతులు ప్రతి విషయంలోనూ నష్టపోతున్న పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లుతెరిచి రైతులకు పెట్టుబడి సహాయం సాయం చేయాలి. ప్రతి విషయంలోనూ రైతులు ఈ ప్రభుత్వంలో నష్టపోయిన నేపధ్యంలో చంద్రబాబునాయుడు ఇప్పటికైనా కళ్లు తెరిచి గుంటూరు మిర్చియార్డుకు రావాలి. రైతుల కష్టాలను తెలుసుకుని వారికి కనీస గిట్టుబాటు ధర వచ్చే విధంగా చంద్రబాబునాయుడు నిలబడకపోతే రాబోయే రోజుల్లో తీవ్రమైన పరిణామాలుంటాయని రైతుల తరపున హెచ్చరిస్తున్నాను.

**ప్రతిపక్షనేతకు కనీస భద్రత లేదు:**

ప్రతిపక్ష నాయకుడు ఇక్కడికి వచ్చి రైతులతో మాట్లాడే ప్రయత్నం చేస్తుంటే.. కనీస పోలీసు భద్రత కూడా ఇవ్వని పరిస్థితి కనిపిస్తోంది. నేను చంద్రబాబునాయుడుకి చెబుతున్నా.. ఎల్లకాలం ఈ ప్రభుత్వం ఉండదు. రేపు మీరు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే మాదిరిగా పోలీసు భద్రత తీసేస్తే ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచన చేసుకోవాలి. మీరు చేస్తున్నది కరెక్టా? కాదా? ఆలోచన చేసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# తూనికలు కొలతల శాఖకు కోకొల్లలుగా తూట్లు...!

(మొదటి పేజీ తరువాయి)

ఇలాంటి ప్రాథమిక హక్కుకు తూట్లు పొడుస్తూ కొంతమంది వ్యాపారులు కొలతల్లో, తూకాల్లో దగాకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా గుంటూరు ఎన్టీఆర్ బస్ స్టేషన్ లో పలు షాపులు నిర్వాహకులు తూకాల్లో ప్రయాణికులను దగా తూకం లేని ప్యాకెట్లు విక్రయిస్తూ దోచుకుంటున్నారు. గుంటూరు పూల మార్కెట్, పండ్లు, కూరగాయల మార్కెట్లలో రెండు చేతుల చికెన్, మటన్, చేపల మార్కెట్లలో కూడా జిల్లా వ్యాప్తంగా అన్ని పట్నాల్లో తోకల్లో మోసాలు జరుగుతున్నాయి. సక్రమమైన కొలతలు, తూకం పొందే హక్కును సాధించుకోవడం ప్రస్తుతం వినియోగదారులకు తలకు మించిన భారంల పరిణమించింది. . పలు రకాల వస్తువులు కొనుగోలు చేసే విషయంలో విపణి వీధిలో వినియోగదారులు ఎన్నో రకాలుగా మోసాలకు గురవుతూనే ఉన్నారు. గుంటూరు బస్టాండ్ లో ప్యాకెట్లపై ముద్రించిన ధరల కన్నా ఎక్కువ రేట్లు వసూలు చేస్తున్నారు. వస్తువులపై ముద్రించిన ధర కంటే ఎక్కువ ధరను వ్యాపారులు వసూలు చేస్తూనే ఉన్నారు. కిలో అని కళ్ళ ముందే తూచి ఇచ్చిన కందిపప్పు వాస్తవానికి ఎనిమిది వందల గ్రాములే ఉంటున్నాయి.. పాలు లేదా నూనె వంటి ద్రవాల కొలత విషయంలోనూ తరుగు సర్వసాధారణంగా ఉంటోంది. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని మండల కేంద్రాల్లో ఉన్న చిల్లర దుకాణా లు, ప్రైవేట్ పాల కేంద్రాలు, నూనె విక్రయదారులు ఎడాపెడ మోసాలకు పాల్పడుతున్నారు. పెట్రోలు బంకుల్లో కూడా మోసాలు జరుగుతున్నాయి దీన్ని మనం అరికట్టలేని పరిస్థితికి వచ్చాం. లక్షలాది రూపాయల జీతాలు పుచ్చుకుంటున్న ఆ శాఖ అధికారులు మాత్రం నిన్న కుండి గుంటూరు జిల్లాలో తూనికలు కొలతల్లో పెద్ద ఎత్తున మోసాలు జరుగుతున్నాయి. రైతులు రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన ధాన్యం, జొన్నలు, మొక్కజొన్నలు, ఇతర రకాల అపరాలు అమ్మేటప్పుడు 70కిలోల బస్తాకు దాదాపు ఆరేడు కిలోలు తూకంలో మోసాల కారణంగా నష్టపోతున్నారు. ఇలా తూనికలు–కొలతల్లో మోసాలవల్ల వినియోగదారులు తాము చెల్లించే డబ్బుకు తగిన విలువైన వస్తువును పొందలేకపోతున్నారు. ఈ విషయంలో వినియోగదారుల రక్షణ కోసం ప్రవేశ పెట్టినదే తూనికలు–కొలతల చట్టం. ఈ చట్టం నేడు సక్రమంగా పని చేయలేక చతికిల పడుతోంది. చట్టం గట్టిగా ఉన్నా దీని బాధ్యత చూడాల్సిన అధికారుల నిర్లక్ష్య వైఖరితో చట్టం ఆశయాలు నీరుగారి పోతున్నాయి.గతంలో తూనికలు–కొలతలు ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క రీతిగా ఉండేవి. కొలతలకు ఒక ప్రాంతంలో మానికను ఉపయోగిస్తే మరొక ప్రాంతంలో 'శేరు'ను ఉపయోగించేవారు. యితేస్వాతంత్ర్యానంతరం దేశమంతటా ఒకే విధమైన తూనికలు–కొలతలను ఉపయోగించేలా నిర్దిష్ట ప్రమాణాలను రూపొందించటం జరిగింది. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ ప్రమాణాలను సక్రమంగా అమలు చేయడం లేదనే ఆరోపణలువస్తున్నాయి.1976వ సంవత్సరంలో స్టాండర్డ్స్ ఆఫ్ వెయిట్స్ అండ్ మెజర్స్ యాక్ట్‌ను ప్రవేశపెట్టారు. ప్యాక్ చేసి అమ్మే వస్తువులకు సంబంధించి స్టాండర్డ్స్ ఆఫ్ వెయిట్స్ అండ్ మెజర్స్ (ప్యాకేజ్డ్ కామొడిటీస్) రూల్స్‌ను రూపొందించారు. దేశవ్యాప్తంగా ఈ చట్టాన్ని ఒకే విధంగా అమలు చేసేందుకు వీలుగా 1985లో స్టాండర్డ్స్ ఆఫ్ వెయిట్స్ అండ్ మెజర్స్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) యాక్ట్‌ను ప్రవేశపెట్టారు. కానీ దీని ప్రమాణాలు అమల్లోకి రావడం లేదు. కొన్నిచోట్ల కొంతమంది వ్యాపారులు వస్తువులను, ద్రవాలు లేదా గింజలను, ప్లాస్టిక్ కవర్లలో పెట్టి యథేచ్ఛగావిక్రయిస్తున్నారు. ఈ కవర్లపై కంపెనీ పేర్లు, బరువు వంటి కొలతలు ఉండటం లేదు. వ్యాపారి చెప్పిందే కొలత . అతను నిర్ణయించిన ధరకే మనకు కావలసిన వస్తువులను. కొనుగోలు చేయాల్సిందే. ఇదిలా ఉండగా తూనికలు–కొలతల చట్టాన్ని అమలుచేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ప్రతి రాష్ట్రంలో ఉన్నట్లే మన రాష్ట్రంలో కూడా లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ ప్రధానాధికారిగా విభాగం పని చేస్తోంది. రీజనల్ డిప్యూటీ కంట్రోలర్‌లు, అసిస్టెంట్ కంట్రోలర్స్, డిస్ట్రిక్ట్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్లు ఈ శాఖలోని ప్రధానమైన అధికారులు. ఉండి విధులు నిర్వహిస్తున్నారు.

**ఎవరికి ఫిర్యాదు చేయాలి?**

తూనికలు–కొలతల విషయంలోమోసపోయినట్లు భావించినప్పుడు స్థానిక లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేయావచ్చు. లేదా కంట్రోలర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. లీగల్ మెట్రాలజీ గ్రీవియన్స్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. వ్యాపారి మోసగిస్తున్నట్లు నిరూపణ అయితే ఆ వ్యాపారికి జరిమానాతో పాటు జైలుశిక్ష కూడా విధించే అవకాశం ఉంది. కానీ ఈ వ్యవహారాల్లో ఇప్పటివరకు జిల్లాలో. ఎంతమంది వ్యాపారులపై చేశారు? జరిమానా విధించారు? చట్ట ప్రకారంగా శిక్షలు ఎవరికైనా పడ్డాయా? చట్టబద్ధమైన వ్యాపారం చేస్తున్న ఎంతమంది వ్యాపారుల లైసెన్సులు రద్దు చేశారు? ఇలాంటి ప్రశ్నలు వేస్తే సంబంధిత అధికారుల నుంచి సమాధానమే రాదు. వినియోగదారుల రక్షణ చట్టం అమలులో భాగంగా ఏర్పాటైన జిల్లా వినిగదారుల ఫోరం, రాష్ట్ర కమిషన్, జాతీయ కమిషన్‌లలో కేసు దాఖలు చేసి నష్టపరిహారం పొందవచ్చు.

**తెలుగులో ఇ-బుక్ ఉందని తెలుసుకోండి**

తూనికలు–కొలతల విషయంలో జరుగుతున్న మోసాలకు సంబంధించి వినియోగదారులు అప్రమత్తం కావాలంటే ముందుగా వారిలో ఆయా చట్టాల గురించిన అవగాహన పెంపొందాలి. అపుడే వారు వ్యాపారులను ప్రశ్నించి సమస్యల పరిష్కరణకు కృషి చేయటం సాధ్యమవుతుంది. ఈ భావనతోనే దశాబ్ద కాలం క్రితమే తెలుగులో తూనికలు – కొలతల శాఖ గురించిన వివరాలతో 'వినియోగదారుల రక్షణలోతూనికలు – కొలతలు' పుస్తకాన్ని ప్రచురించిన కన్స్యూమర్ ఎడ్యుకేషన్ సొసైటీ మరో ప్రయోగం చేసింది. కంప్యూటర్ లిటరసీ పెరుగుతున్న నేపథ్యంలో ఇ–బుక్‌ల ద్వారా విద్యార్థుల్లో అవగాహనను కల్పించటం సులభమని భావిస్తూ ఎలక్ట్రానిక్ పుస్తకాన్ని విడుదల చేయాలని కన్స్యూమర్ ఎడ్యుకేషన్ సొసైటీ భావించింది. దానిలో భాగంగాతూనికలు–కొలతలపై తొలి ఇ-బుక్‌ను గతంలో విడుదల చేశారు.

## గుంటూరు తిరుమల గోల్డ్ అండ్ డైమండ్ జ్యువెలరీతో 'కిస్నా' భాగస్వామ్యం



**గుంటూరు,రూరల్ మేజర్ న్యూస్ :**
షాప్-ఇన్-షాప్ మోడల్‌లో భాగంగా గుంటూరు లక్ష్మీపురంలో ఉన్న తిరుమల గోల్డ్ అండ్ డైమండ్స్ తో కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా బుధవారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో తిరుమల గోల్డ్ అండ్ డైమండ్స్ అధినేత జి. సత్యనారాయణ మాట్లాడుతూ 'షాప్-ఇన్-షాప్ మోడల్ ద్వారా కిస్నా జ్యువెలరీని పరిచయం చేయడం పట్ల మేము చాలా సంతోషంగా ఉన్నాం. ఇది మా కస్టమర్లు ఒకే చోట అద్భుతమైన డిజైన్ల విస్తృత శ్రేణిని అన్వేషించడానికి వీలు కల్పిస్తుంది. ఈ భాగస్వామ్యం సాటిలేని నాణ్యత, నమ్మకంతో కూడిన ప్రీమియం ఆభరణాలను అందించే మా నిబద్ధతను బలోపేతం చేస్తుంది' అని చెప్పారు. కిస్నా జ్యువెలరీ రీజినల్ సేల్స్ మేనేజర్ మహేష్ గందాని మాట్లాడుతూ తమ బ్రాండ్ నాణ్యమైన, సమకాలీన గోల్డ్ అండ్ డైమండ్ ఆభరణాలు ఈ ప్రాంత వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. కిస్నా స్టేట్ హెడ్ నికుంజ్ కోరట్, ఏరియా సేల్స్ మేనేజర్ శైలేష్ కాంబ్లే నాయకత్వంలో గుంటూరులో అసాధారణమైన ఆభరణాల డిజైన్ లను, గొప్ప షాపింగ్ అనుభవాన్ని అందించడానికి తాము కృషి చేస్తామని చెప్పారు. షాప్-ఇన్-షాప్ మోడల్ కస్టమర్లకు తిరుమల గోల్డ్ అండ్ డైమండ్స్ ను కిస్నా జ్యువెలరీ క్యూరేటెడ్ కలెక్షన్ ను పొందేందుకు అవకాశాలను అందిస్తుందని తెలిపారు.

ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం కస్టమర్ల సౌలభ్యాన్ని పెంచుతుందని, ప్రఖ్యాత తిరుమల గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ ప్రత్యేకమైన కిస్నా షాపింగ్ అనుభవాన్ని అందిస్తుందన్నారు.

## ఎస్ఆర్ఎంలో ఉచిత కంటి వైద్య శిబిరం





**మంగళగిరి మేజర్ న్యూస్:**
ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీ ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. గుంటూరుకు చెందిన అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్యులు తదు బృందంతో విచ్చేసి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్ వైద్య శిబిదాన్ని ప్రారంభించారు. అనంతరం డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రి ఆప్తమాలజిస్ట్ డాక్టర్ శ్రావణి తన సిబ్బందితో కలిసి వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ 419 మంది ఉద్యోగులు, విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి వైవ్య సలహాలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ, ఇప్పటి వరకూ పలు విద్యా సంస్థల్లో సుమారు 30 పైగా ఉచిత కంటి వైద్య శిబి రా లను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ డైరెక్టర్లు అనిల్ నిగమ్, అనూప్ సింగ్ సూర్యవంశి, రేవతీ బాలక్రిష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి రిజర్వాయర్లను నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలి

### నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :**
గుంటూరు నగరపాలక సంస్థ త్రాగునీటి రిజర్వాయర్లను నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలని, ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమీషనర్ తమ రోజు వారీ పర్యటనలో భాగంగా రెడ్డిపాలెం రిజర్వాయర్, వెహికిల్ షెడ్, సంజీవయ్య నగర్ రోడ్ విస్తరణ పనులు, నవభారత్ నగర్, జెకెసి నగర్ ల్లోని పలు ప్రాంతాలలో పర్యటించి పారిశుధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ, త్రాగునీటి సరఫరా వ్యవస్థ అత్యంత కీలకమని, త్రాగునీటి శుద్ధి జరిగే హెడ్ వాటర్ వర్క్స్ లో ప్రత్యేకంగా ల్యాబ్ లో క్లోరిన్, నాణ్యత పరిశీలించిన అనంతరమే రిజర్వాయర్లకు సరఫరా జరుగుతుందన్నారు. స్థానికంగా ఉండే రిజర్వాయర్లను నిర్దేశిత గడువు మేరకు తప్పనిసరిగా శుభ్రం చేయించాలని, శుభ్రం చేసిన తేదీ, వివరాలను రిజర్వాయర్ దగ్గర ఏర్పాటు చేసిన బోర్డ్ పై కనిపించేలా వ్రాయాలన్నారు. అలాగే ప్రతి ఏఈ పరిధిలో రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని పైప్ లైన్ లీకుల మరమత్తులను వెంటనే పూర్తి చేయాలని, ఎక్కడా త్రాగునీటి సరఫరా అందలేదనే ఫిర్యాదు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెహికల్ షెడ్ని పరిశీలించి, ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో పారిశుధ్య పనులకు పంపే వాహనాలు తప్పనిసరిగా నిర్దేశిత సమయానికి వెళ్లాలన్నారు. ఈ-ఆటోలు, పుష్ కాట్స్, ఇతర వాహనాలు ఎప్పటికప్పుడు మరమత్తులు చేయించాలని ఏఈని ఆదేశించారు. సంజీవయ్య నగర్ గేటు నుండి రెడ్డిపాలెం రోడ్ వరకు చేపట్టిన విస్తరణ పనులను పరిశీలించి, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. త్వరలో శంకర్ విలాస్ ఆర్ఓబి పనులు ప్రారంభమైతే ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున పనులు వేగంగా జరగాన్నారు. జెకెసి నగర్, నవభారత్ నగర్ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులను పరిశీలించి, పనులు జరిగే సమయంలోనే నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఎమినిటి కార్యదర్శులు, ఏఈలు పర్యవేక్షణ చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లేకుంటే బిల్లుల చెల్లింపు నిలిపివేస్తామని స్పష్టం చేశారు. పర్యటనలో డిఈఈలు రమేష్ బాబు, కళ్యాణరావు, సతీష్ కుమార్, ఏసిపి రెహ్మాన్, ఆర్ఓ రవికిరణ్ రెడ్డి, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి, ఏఈలు, టిపిఎస్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సెంట్రల్ జి.ఎస్.టి ఉద్యోగులకు క్రీడలలో బంగారు పతకాలు

**గుంటూరు, రూరల్ మేజర్ న్యూస్ :**
సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి ఇటీవల హైదరాబాద్ లో జరిగిన సౌత్ ఇండియా సెంట్రల్ రెవెన్యూ క్రీడా పోటీలలో సెంట్రల్ జి.ఎస్.టి డిపార్ట్మెంట్‌కు చెందిన ముగ్గురు ఉద్యోగులు నాలుగు బంగారు, రెండు రజిత పతకాలు సాధించి, గుంటూరు సెంట్రల్ జి.ఎస్.టి కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకువచ్చారని ఆ శాఖ కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపారు. గుంటూరు కన్నవారితోట జీఎస్టీ భవన్ లో పతకాలు తెచ్చిన ఉద్యోగులకు బుధవారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. సూపరింటెండెంట్ పి.వెంకటాచలం లాన్ టెన్నిస్ లో 40 ప్లస్ సింగిల్స్, 40 ప్లస్ డబుల్స్, 50 ప్లస్ డబుల్స్ లో మూడు బంగారు పతకాలు గెలుచుకున్నారన్నారు. ట్యాక్స్ అసిస్టెంట్ పి.వెంకటేశ్వర్లు 100 మీటర్ల పరుగు పందెం 50 ప్లస్ కేటగిరిలో గోల్డ్ మెడల్ సాధించగా, ట్యాక్స్



అసిస్టెంట్ అనిత కు షాట్ పుట్, డిస్కస్ త్రో ఈవెంట్ల లో రెండు రజిత పతకాలు లభించాయని వివరించారు. ఈ విజయాలు ఉద్యోగుల అంకితభావం, కృషి మరియు టీమ్ వర్క్ కు నిదర్శనమన్నారు. వారు తమ వృత్తి పరమైన బాధ్యతల్లోనే కాకుండా, క్రీడల్లోనూ ప్రావీణ్యత సంపాదించడం అపూర్వమన్నారు. అనంతరం ముగ్గురు ఉద్యోగులను కమిషనర్ నరసింహారెడ్డి పట్టు శాలువాలతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు.

తమ ఉద్యోగుల క్రీడా విజయాలు శాఖాపరంగా గర్వంగా భావిస్తున్నామని, వారు మరిన్ని విజయాలు పొందేందుకు వారికి అండగా మరింత తోడ్పాటు, సహకారం, సౌకర్యాలు అందిస్తామని కమిషనర్ వెల్లడించారు. ఈ నెల 21 నుండి 23 వరకు బెంగుళూరు లో జరగనున్న ఆల్ ఇండియా సెంట్రల్ రెవెన్యూ క్రీడా పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుండి ఈ ముగ్గురూ ఎంపిక కావడం విశేషంగా కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో జి. ఎస్.టి అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, ఎ.సి లు వి.వెంకటేశ్వరరావు, ఎం. నాగరాజు, బి.రవికుమార్ సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, చిదేళ్ళ ఈశ్వరరావు,ప్రకాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల హక్కు సాధనకై నూతన కమిటీ ఏర్పాటు

**గుంటూరు,రూరల్ మేజర్ న్యూస్ :**

బీసీలను చైతన్యం చేసి, వారి హక్కుల సాధన కోసం కృషిచేయడానికి నూతన కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్ అన్నారు. గుంటూరు నల్లపాడు రోడ్డులోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం క్రాంతి కుమార్ మాట్లాడారు. 34% రిజర్వేషన్ ప్రకటనలు కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితం అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనగణను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బీసీలు మేల్కోవాలని పిలుపునిచ్చారు. అలాగే ఈరోజు బాపట్ల జిల్లా యువజన అధ్యక్షులు గా పచ్చపట్ల గంగ రాజు ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర




యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంత రావు,రేపల్లె నియోజకవర్గం యువజన అధ్యక్షులు కొనిక వెంకట్రావు, గాలి రాజు, రాకేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# యూపీహెచ్సీని సందర్శించిన వరల్డ్ బ్యాంకు టీం

**మంగళగిరి, మేజర్ న్యూస్:**

నగరంలోని ఇందిరానగర్ యూపీహెచ్సీని బుధవారం వరల్డ్ బ్యాంకు టీం సందర్శించారు. వరల్డ్ బ్యాంకు కన్సల్టెంట్ గణేష్, మొహిర్ అహ్మదేవ్‌లు సందర్శించి యూపీహెచ్సీలోని ఓపి, ఈహెచ్ఆర్, నేషనల్ ప్రోగ్రామ్స్ అమలు, ఎన్కాస్ స్టాండర్డ్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేట్ క్వాలిటీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ వరల్డ్ బ్యాంక్ యూపీహెచ్సీల్లో నాణ్యత ప్రమాణాలు, పనితీరును పరిశీలించడానికి వచ్చారన్నారు. భవిష్యత్తులో వరల్డ్ బ్యాంకు కూడా సహాయం చేయాలని భావిస్తుందని, దేనికి సాయం అందిస్తే బాగుంటుందనే విషయాలను కూడా వారు పరిశీలించారన్నారు. యూపీహెచ్సీల్లో అవసరమయ్యే కెపాసిటీ బిల్డింగ్ వంటి అవసరాలను వారి



దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ క్వాలిటీ కన్సల్టెంట్స్ డాక్టర్ నరేంద్ర, వాసు, ఎన్యూహెచ్ఎం కన్సల్టెంట్ వేణు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష తదితరులు పాల్గొన్నారు.

# గ్లియోబ్లాస్టోమాను నివారించడంలో సరికొత్త విధానం

## కనిపెట్టిన కెఎల్ యు పరిశోధనా విద్యార్థిని సాహితీ

**తాడేపల్లి, మేజర్ న్యూస్:**

కొన్ని ఔషధాల యొక్క కొత్త కలయిక ద్వారా గ్లియోబ్లాస్టోమా మల్టీఫార్మ్ (జిబిఎం) ను అదుపులో ఉంచడం ద్వారా ప్రాణాంతకమైన మెదడు క్యాన్సర్‌ను నివారించడానికి సులువైన మార్గాన్ని కనిపెట్టినట్లు వడ్డేశ్వరం కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ బయోటెక్నాలజీలోని పరిశోధనా విద్యార్థిని సాహితి ఆర్ చామ తెలిపారు. తన మార్గదర్శి అయిన బయోటెక్నాలజీ ఆచార్యులు డాక్టర్. ఎం. జానకి రామయ్య నేతృత్వంలోని పరిశోధనలు రెండు కీలకమైన జీవక్రియ మార్గాలయిన హెచ్‌డిఎసి మరియు జిఎల్‌యుటి ఇన్‌హిబిటర్‌లను ఉపయోగించడం ద్వారా గణనీయంగా ఫలితాలను మెరుగుపరుస్తాయని సూచించాయన్నారు. (జిబిఎం), నాలుగవ గ్రేడ్ క్యాన్సర్, సాధారణంగా రోగ నిర్ధారణ తర్వాత 13 నుండి 15 నెలల మధ్య సమయంలో భయంకరమైన రోగ నిరూపణను కలిగి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎహెచ్ డిఎ మరియు టుబాస్టైటాయిన్ వంటి హెచ్ డిఎసి ఇన్హిబిటర్లు కొన్ని (జిబిఎం) సెల్ లైన్లలో వాగ్దానాన్ని చూపించినప్పటికీ, అన్ని సెల్ లైన్లు సమానంగా స్పందించవని డాక్టర్ జానకి రామయ్య తన పరిశోధనలో నిరూపించబడిందన్నారు. ఇది ద్వంద్వ చికిత్స వ్యూహం యొక్క పరిశోధనకు దారితీసిందన్నారు. హెచ్ డిఎసి ఇన్హిబిటర్‌లను గ్లట్ ఇన్హిబిటర్‌లతో కలపడం వలన మెదడులో గ్లూకోజ్ రవాణాను నిరోధించవచ్చునన్నారు. ఈ కొనసాగుతున్న



పరిశోధన నుండి ప్రారంభ ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయన్నారు. సంభావ్యమైన ఈ పరిశోధన ఫలితాలు ఎంతో ప్రమాదకరమైన క్యాన్సర్ ను నివారించడంలో నూతన చికిత్సకు శ్రీకారం చుట్టినట్లయిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.ప్రవీణ్ తదితరులు పాల్గొని విద్యార్థిని సాహితీని అభినందించారు.

# కెఎల్ యులో ట్రిపుల్ ఈ కార్యశాల ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న కెఎల్ యు ఇంచార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు.

**తాడేపల్లి, మేజర్ న్యూస్:**

వడ్డేశ్వరం కె ఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్యశాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సామ్రాజ్ సోలార్ ఇండస్ట్రీస్ సిఇఒ ఎ. అజయ్ కుమార్ ముఖ్య అతిథి గా పాల్గొని ప్రసంగించారు. రాబోయే రోజుల్లో దేశ ఇంధన అవసరాల కోసం సౌరశక్తి మార్పిడి డొమైన్‌లో వ్యవస్థాపకుల ఆవశ్యకతను గురించి వివరించారు. డిఎస్టి, ఎఎన్ఆర్ ఎఫ్ , కెఎల్ యు సంయుక్తంగా ప్రాయోజిత అంతర్జాతీయ కార్యశాలను నిర్వహిస్తున్నట్లు ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ ఆర్‌బిఆర్ ప్రకాష్ తెలిపారు. పవర్ ఎలక్ట్రానిక్స్ ఫర్ నెక్స్ట్ జనరేషన్స్ ఎనర్జీ అండ్ ఎలక్ట్రిక్ వెహికల్ సొల్యూషన్స్ ఛాలెంజెస్, హ్యాండ్ ఆన్ అప్లికేషన్స్ అనే అంశంపై టెక్నికల్ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యశాలలో పునరుత్పాదక శక్తి మార్పిడి, ఎలక్ట్రిక్ వెహికల్ డ్రైవ్, ఛార్జింగ్ టెక్నాలజీలపై వక్తలు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, ప్రిన్సిపల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డాక్టర్ టి.రామకృష్ణారావు, ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ ఆర్‌బిఆర్ ప్రకాష్, కార్యశాల కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం. కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ గ్రేస్ అపార్ట్మెంట్ నిర్మాణానికి సహకరించిన వారిపై వేటు

## వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి, టిపిబిఓలు సస్పెండ్

## టిపిఎస్, ఏసిపి, డిసిపి, సిటి ప్లానర్లలకు షోకాజ్ నోటీసులు

## కన్నెర్ర చేసిన నగర కమిషనర్ శ్రీనివాసులు

**గుంటూరు నగర పాలక సంస్థ,మేజర్ న్యూస్ :**

గుంటూరు నగరంలోని గ్రీన్ గ్రేస్ అపార్ట్మెంట్ నిర్మాణ పనులకు వర్క్ స్టాప్ ఆర్డర్ నోటీసు జారీ చేసినపట్టికీ, అంతర్గతంగా పనులు జరుగుతుండం, కేటాయించిన విధుల్లో పర్యవేక్షణ లోపంపై స్థానిక వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి, టిపిబిఓలను విధులను సస్పెండ్, టిపిఎస్, ఏసిపి, డిసిపి, సిటి ప్లానర్లలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని నగర నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్థానిక పట్టాభిపురం మెయిన్ రోడ్ లో నిర్మాణంలో ఉన్న గ్రీన్ గ్రేస్ అపార్ట్మెంట్ నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టకపోవడంపై జిఎంసి వర్క్ స్టాప్ ఆర్డర్ నోటీసు జారీ చేసి, స్థానిక పట్టణ ప్రణాళిక అధికారులను పనులు జరగకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించామని తెలిపారు. అనంతరం పనులు అంతర్గతంగా జరుగుతున్నాయని అందిన ఫిర్యాదుల మేరకు జిఎంసి అదనపు కమిషనర్ నేతృత్వంలో కమిటి ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కమిటి




ప్రాథమిక నివేదిక, మంగళవారం తమ క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం వర్క్ స్టాప్ ఆర్డర్ నోటీసు అందిన అనంతరం కూడా పనులు జరిగాయని నిర్ధారించడం జరిగిందని, కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంపై స్థానిక వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి సిహెచ్.జగన్మోహనరావు, టిపిబిఓ కె.నిఖిల్ వంశీలను విధుల నుండి సస్పెండ్ చేస్తూ, పర్యవేక్షణ అధికారులైన టిపిఎస్ సత్యనారాయణ, ఏసిపి రెహ్మాన్, డిసిపి సూరజ్ కుమార్, సిపి రాంబాబులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. వర్క్ స్టాప్ ఆర్డర్ నోటీసులు అందిన తర్వాత కూడా పనులు చేపట్టిన భవన యజమానిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## మృతిచెందిన జిఎంసి కార్మికుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా అందజేత

### బాధిత నగరపాలక సంస్థ అండగా ఉంటుంది

### నగర నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :**

కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలక సంస్థ తరుపున అండగా ఉంటామని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ ఔట్సోర్సింగ్ కార్మికులు జూటూరి వెంకటేశ్వర రావు, బంగారు సింహాద్రి ల కుటుంబ సభ్యులకు ఎక్స్ గ్రేషియా చెక్ లను బుధవారం కమిషనర్ ఛాంబర్ నందు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందన్నారు. ఇటీవల ప్రజారోగ్య విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు జూటూరి వెంకటేశ్వర రావు, బంగారు సింహాద్రి లు మరణించారని, వారి కుటుంబ సభ్యులకు సాధారణ మరణానికి అందే ఎక్స్ గ్రేషియా, మట్టి ఖార్చుల క్రింద రూ.2 లక్షల చెక్కు లని అందించామని తెలిపారు. అలాగే నగరపాలక సంస్థ నుండి అందాల్సిన పరిహారాలు, పి.ఎఫ్. కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబందిత విభాగాధిపతులను, సూపరింటెండ్లను ఆదేశించామని తెలిపారు. కార్మికులు కూడా తమ సమస్యల పై అర్జీలు లేదా ఫిర్యాదులు తమకు అందించవచ్చని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఘనంగా మల్లేశ్వరుని ధ్వజారోహణం





**మంగళగిరి, మేజర్ న్యూస్:**

నగరంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వం స్వామివారి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన బుధవారం ధ్వజారోహణం జరిగింది. ఈ సందర్భంగా అంకురారోపణ, దేవత ఆహ్వానం పూజలు నిర్వహించి, నంది ముద్దల ప్రసాదం పంపిణీ చేశారు. ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రావణబ్రహ్మ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం జరిగింది. ప్రధాన అర్చకులు మహేష్ కుమార్ శర్మ, పురోహితులు శ్యామసుందర శాస్త్రి పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన నాగ వెంకట పవన్ కుమార్, లావణ్య దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ భోగి కోటేశ్వరరావు, శ్రీ సీతారామ కోవెల మాజీ చైర్మన్ వాకా మంగరావు తదితరులు పాల్గొన్నారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి జేవీ నారాయణ పర్యవేక్షించారు.

## వైసిపి ఆత్మీయ సమావేశంలో గజ్జల భార్గవ్ రెడ్డి





**రాజుపాలెం మేజర్ న్యూస్:**

మండల హెడ్ క్వార్టర్లో బుధవారం వైఎస్ఆర్సిపి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త గజ్జల భార్గవ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గజ్జల భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి నన్ను సత్తెనపల్లి సమన్వయకర్తగా పంపించడం చాలా సంతోషంగా ఉందని, నా మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, ప్రతి వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటానని, పార్టీ బలోపేతానికి కృషిచేసి రాబోయే రోజుల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరల మనందరం కలిసి ముఖ్యమంత్రిగా చేసుకుందామని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు, రాజుపాలెం మండలం లోని కోట నెమలిపురి మా నాయనమ్మ వాళ్ళ ఊరని, మాది కుంకలగుంట్ల అని, నేను ఈ నియోజకవర్గానికి స్థానికుడనని, నిత్యం కార్యకర్తలకు అండగా ఉంటానని, ఏ సమస్య వచ్చినా నా దృష్టికి వస్తే వెంటనే అక్కడికి వస్తానని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు, ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, జడ్పిటిసి దొంతి రెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, బాసులింగారెడ్డి, మర్రి సుబ్బారెడ్డి, ఎంపీపీ తేలుగుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, రాజుపాలెం ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫర్వానా ను అభినందించిన బొల్లా బ్రహ్మనాయుడు

**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :**

పిడుగురాళ్ల లోని తిరుమల ఆక్స్ఫర్డ్ స్కూల్ విద్యాసంస్థల చైర్మన్, వైయస్సార్ పార్టీ వినుకొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు జన్మదినం సందర్భంగా పిడుగురాళ్ల పట్టణంలోని పల్నాడు హాస్పిటల్ డాక్టర్, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతలపూడి అశోక్ కుమార్, తిరుమల ఆక్స్ఫర్డ్ స్కూల్ ఆర్ట్ , క్రాఫ్ట్ టీచర్ షేక్. ఫర్వా బొల్లా బ్రహ్మ నాయుడు ని నరసరావుపేట లోని నివాసంలో కలిసి బొల్లా దంపతుల చిత్రాన్ని గీసి వారికి ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. దీంతో బ్రహ్మ నాయుడు తమ చిత్రాన్ని చూసి ఎంతో హర్షం వ్యక్తం చేశారు. ఇది కేవలం



చిత్రంగా కాకుండా నిజంగా తమని తాము చూసుకున్నట్లుగా ఉంది అని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే బ్రహ్మ నాయుడు తమని ఆహ్వానించిన తీరు, తమ పట్ల చూపించిన ఆదరాభిమానాలు వెలకట్టలేనివి అని వారు ఆనందం వ్యక్తం చేశారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో జరిమానా

**తెనాలి, మేజర్ న్యూస్**

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఇద్దరికి రూ. 10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. తెనాలి వన్ టౌన్ సీఐ వి. మల్లికార్జునరావు ఇటీవల వాహనాలను తనిఖీ చేశారు. పట్టణానికి చెందిన మైలా వేణుగోపాల్, బొమ్మిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, పోతు ప్రసాద్‌కుమార్ మద్యంతాగి వాహనాలను నడుపుతున్నట్టు గుర్తించి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఇద్దరిని బుధవారం ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి. వివేక్ వర్ధన్ ఎదుట హాజరుపరచగా న్యాయమూర్తి ముగ్గురు నిందితులకు రూ. 10 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాలన్నారు. మద్యం సేవించి అర్ధరాత్రుళ్ల వాహనాలను నడిపేవారిపై చర్యలు తీసుకుంటామని సీఐ ఈ సందర్భంగా తెలిపారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి శోభాయాత్ర



**మంగళగిరి, మేజర్ న్యూస్:**

మరాఠా సామ్రాజ్య వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి వేడుకలు మంగళగిరిలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శోభాయాత్ర మంగళగిరి గౌతమ బుద్ధ రోడ్డు, కాళికామాత గుడి వద్ద నుండి ప్రారంభమై అంబేద్కర్ బొమ్మ సెంటర్ మీదుగా బంగ్లా వరకు చేరుకొని తిరిగి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, మిద్దె సెంటర్ మీదుగా సీతారామ కోవెల వరకు జయహో ఛత్రపతి శివాజీ మహారాజ్ నినాదాలతో శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షులు తుల్లిమిల్లి రామకృష్ణ, మంగళగిరి పట్టణ బిజెపి అధ్యక్షులు దామర్ల నాగేశ్వరరావు, పంచమర్తి ప్రసాద్, పడమట రాధాకృష్ణ యోగి, కాండ్రు భాను కిషోర్, మునగపాటి వెంకటేశ్వరరావు, భారతీయ జనతా పార్టీ నాయకులు, హిందూ సంఘాల ప్రతినిధులు, ఛత్రపతి శివాజీ అభిమానులు పాల్గొన్నారు.

# హత్యకేసులో ముద్దాయి అరెస్ట్

**తెనాలి, మేజర్ న్యూస్**

షేక్ రబ్బాని అనే పండ్ల వ్యాపారిని హత్య చేసిన ఉదంతంలో ముద్దాయిని అరెస్ట్ చేసినట్లు త్రీటౌన్ సీఐ ఎస్ రమేష్ బాబు పేర్కొన్నారు.

బుధవారం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ రమేష్ బాబు మాట్లాడుతూ మృతుడు రబ్బాని మేనకోడలు సనాకు పెనపాడుకు చెందిన ముద్దాయి షేక్ గౌస్ బాషా తో 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు ఒక మగ సంతానం ఉన్నారని తెలిపారు. గౌస్ బాషా వ్యసనాలకు బానిసై భార్యాపట్ల అనుచితంగా వ్యవహరిస్తుండడంతో మూడు నెలల క్రితం సనా పుట్టింటికి వెళ్ళిందని తెలిపారు. గౌస్ బాషా తన భార్య కోసం రెండు మూడు సార్లు వెళ్లినా అతని ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో రబ్బాని తన మేనకోడలిని



పంపించేందుకు నిరాకరించాడు. సనా భర్త వద్దకు వెళ్లకుండా అడ్డుకుంటున్న కారణంగా గౌస్ బాషా రబ్బానిపై కక్ష పెంచుకున్నాడు. ఈనెల 16వ తేదీ మూడు గంటల సమయంలో ముద్దాయి గౌస్ బాష, హైదరాబాదు నుండి వచ్చిన అతని స్నేహితుడు కాజాను మధ్యవర్తిగా వెంటబెట్టుకుని తన భార్యను కాపురానికి పంపమని అడిగేందుకు మరో వెళ్లిన క్రమంలో రబ్బాని కి గౌస్ బాషా కు మధ్య వివాదం చోటుచేసుకుంది. రబ్బాని పై ముద్దాయి గౌస్ బాషా చాకుతో దాడి చేసాడు. తన భార్యను కాపురానికి పంపలేదు అన్న ఒక కారణంతో కక్షపూరితంగా దాడికి పాల్పడినట్లు తమ విచారణలో తేలిందని సి ఐ రమేష్ బాబు తెలిపారు. అనంతరం కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై ప్రకాష్ రావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# పేదవారిని పట్టించుకోని కూటమి ప్రభుత్వం

## వైసీపీ తిరిగి అధికారంలోకి రాదు

## దేవుడి పేరుతో బీజేపీ రాజకీయం

## కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

**మంగళగిరి, మేజర్ న్యూస్:**

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని పేదవారిని పట్టించుకోవడం లేదని, కూటమి ప్రభుత్వం కోటీశ్వరుల ప్రభుత్వమైందని కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చింతా మోహన్ విమర్శించారు. మంగళగిరి ఐబీఎన్ భవన్ ప్రెస్ క్లబ్ లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పోలీస్ అధికారుల బట్టలూడదీస్తా... సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలి పెట్టనని హెచ్చరికలు చేయడం తప్పు అని, మాట్లాడేటప్పుడు భాష జాగ్రత్తగా వాడాలని హితవు పలికారు. వైయస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని భ్రమ పడుతున్నాడని, తండ్రి మరణంతో వచ్చిన సానుభూతితో ప్రజలు ఒకసారి అధికారం ఇచ్చారని గుర్తు చేశారు. వైసిపి తిరిగి అధికారంలోకి రాదని, జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి అవుతాడనే నమ్మకం లేదన్నారు. జగన్ పై సీబీఐ 11 కేసులు నమోదు చేసిందని, ప్రజా తీర్పు కూడా 11 సీట్లు ఇచ్చారని ఇది ఒక అద్భుత విచిత్రం అన్నారు. ఎన్నో సార్లు బెయిల్ తీసుకున్న జగన్



ఏ క్షణంలోనైనా జైలుకు పోతాడన్నారు. జగన్ జైలు యాత్రలకు బదులు దేవాలయాల చుట్టూ తిరిగితే చేసిన పాపాలు పోతాయన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పేద ప్రజల సమస్యలను ఎంత మాత్రం పట్టించుకోవడంలేదని, కూటమి ప్రభుత్వం కోటీశ్వరుల ప్రభుత్వం గా మారిందని దుయ్యబట్టారు. సి ఆర్ డి ఏ లో పెద్దపెద్ద వాళ్లకే కాంట్రాక్టులు ఇస్తున్నారని, ఎస్సీ ఓబీసీలకు కాంట్రాక్ట్ పనులు ఇవ్వడం లేదన్నారు. కాంట్రాక్ట్ పనులు ఇవ్వకుంటే ఎస్సిఓబిసిలు ఆర్థికంగా ఎలా ఎదుగుతారని ప్రశ్నించారు. కనీసం చిన్నచిన్న పనులైనా ఎస్సీ, ఓబీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు పై ప్రేమతో ప్రజలు ఆయనకు ఓట్లు వేసి గెలిపించలేదని, జగన్ పై ఉన్న భయంతో కూటమి పార్టీలకు అధికారం ఇచ్చారని గుర్తు చేశారు. గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ పరిస్థితి రోజురోజుకు దిగజారి పోతుందని, అన్ని వర్గాల ప్రజలు నిరాశతో అసంతృప్తిగా ఉన్నారన్నారు. తిరుపతికి రావలసిన రాజధానిని బాబు తుళ్లూరుకు తెచ్చాడని, 60 వేల కోట్ల అప్పులు తెచ్చి ఒక ప్రాంతంలోనే ఖర్చు చేస్తున్నాడని ఆరోపించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి గురించి చంద్రబాబు పట్టించుకోవడంలేదన్నారు. రాయలసీమ జిల్లాల్లో రోడ్లు లేకుండా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సూది, దూది లేకుండా ఉన్నాయన్నారు. ఇక ప్రభుత్వ బడులు కళాశాలలు పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని అన్నారు. పోలవరం ఖర్చుపై జ్యూడిషియల్ కమిషన్ వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇక బీజేపీ దేవుడిని అడ్డం పెట్టుకొని రాజకీయం చేస్తుందని, నేడు దేశ పరిస్థితులు ఊహించలేనంత దారుణంగా ఉన్నాయన్నారు. ఈవీఎంలే బిజెపిని గెలిపిస్తున్నాయని, సుప్రీం కోర్టులో ఈవీఎంలపై పిటిషన్ పడిందన్నారు. జడ్జీలను మేనేజ్ చేసి తీర్పులను తారుమారు చేశారని సుప్రీంకోర్టులో అందరూ చెప్పుకుంటున్నారని అన్నారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో మాట్లాడకుండా కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారిని ఎంపిక ఎలా చేశారని ప్రశ్నించారు. బిజెపికి నీతి లేదని, నిజాయితీ అంతకన్నా లేదన్నారు. దేశంలో దళితులు తినేందుకు తిండి లేదని, 50శాతం పైగా ఉన్న ఓబీసీల పరిస్థితి కూడా దారుణంగా ఉందన్నారు.

## యరపతినేని నా సవాల్ స్వీకరించలేదు, అందుకే నేను కూడా ఆయన సవాల్ స్వీకరించట్లేదు

### - మాజీ ఎమ్మెల్యే. కాసు మహేష్ రెడ్డి

**పిడుగురాళ్ల మేజర్ న్యూస్**

గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీని వాసరావు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డిని ఉద్దేసింశి రాజకీయ సన్యాసం తీసుకోవాలని హితవు పలక టాన్ని మహేష్ రెడ్డి ఖడించారు. ఈ సంద ర్భంగా కాసు మీడియాతో మాట్లాడుతూ యరపతి నేని శ్రీనివాసరావు నేను ఎన్నికల సమయంలో సవాల్‌కు ప్రతి సవాల్ విసురుకున్నాం,కానీ ఆ సవాల్‌కు యరపతినేని కట్టు బడిఉంటానని అప్పుడు చెప్పలేదు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి మహేష్ రెడ్డి అంటారు,వాస్తవమే సవాల్ కు ప్రతి సవాల్ విసురుకున్నామ్ అది ఏమి జరిగిందో మరొకసారి మీకూ ప్రజలకి తెలియజేయాలి వుంది. మీరు చెప్పింది ఏంటీ ఎలక్షన్లో ఓడిపోతే నేను రాజకీయాలను విరమించుకోవాలి, అలాగే నేను మీకు విసిరిన చాలెంజ్ ఏంటి ప్రతి సవాల్ మెడికల్ కాలేజీ నా హయాంలో జగన్మోహన్ రెడ్డి ద్వారా మొదటి బడ్జెట్లో శాంక్షన్ చేయించాను అని క్లియర్ గా చెప్పాను దానికి మీరు కట్టుబడి ఉంటే అప్పుడే యరపతినేని రాజకీయ సన్యాసం తీసుకోవాలని కదా అన్నారు. ఆనాటి సవాలు,ప్రతి సవాలుకు సంబంధించి మహేష్ రెడ్డి ఒక వీడియోను మీడియాకు చూపించారు. మీ సవాల్ మేము స్వీకరిం చినప్పుడు, మా సవాల్ మీరు స్వీకరించిచేతే దానికి ఒక నిబద్ధత ఉంటుంది. సవాల్ కు ప్రతి సవాల్ అన్నప్పుడు రెండు వైపులా ఉండాలి. మీ సవాల్ మీ సేకరించినప్పుడు, మా సవాల్ మీరు స్వీకరించకపోతే ఇక సవాల్ ఎక్కడ ఉత్పన్నం అవుతుందని కాసు ప్రశ్నించారు. అయినా మాట అనేది ఇద్దరూ ఇచ్చుకుంటే అది ఒక రకం, మీరు ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గురజాల నియోజకవర్గంలో ఇంటికి ఒక సిలిండర్ ప్రతి ఏడాది ఇస్తామన్నారు.మీరు గెలిచి ఏడాది అవుతున్న మీరు ఇచ్చిన మాట



నిలబెట్టుకుంటారా లేదా ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. నియోజకవర్గంలో 60,70 వేల సిలిండర్లు అంటే ఇస్తారా ఇవ్వరా ఎప్పుడు ఇస్తారు, దాని గురించి యరపతినేని మాట్లాడరు, చంద్ర బాబు నాయుడు వాలంటీర్లు వ్యవస్థ కొనసాగి స్తామని, 10 వేలు ఇస్తామన్నారు. ఆ వాగ్దానం నెరవేర్చరా,ఇచ్చిన హామీ నెరవేర్చకపోతే వెంటనే రాజీనామా చేయమని డిమాండ్ చేశారు. ప్రజలకు అన్నీ తెలుసు, గాలి వచ్చింది, గాలిలో గెలిచాము అను కోకు, ప్రజలకి నిజాలు తెలుస్తాయి. అలివి గాని హామీలు ఇచ్చారు. ప్రజలు ఇప్పటికే9 నెలల లో తెలుసుకున్నారు. మోసాలు గురించి, జరగబోయే ఎన్నికలలో ఎలాంటి ఫలితం ఉంటుందో, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జగన్మోహన్ రెడ్డి అఖండ మెజార్టీతో గెలుస్తారని, ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరూ ఎదురుచూస్తున్నారన్నారు.

## పల్నాడు ప్రాంత విద్యాభివృద్ధికి కృషి చేస్తా..- లక్ష్మణరావు

పిడుగురాళ్ల మేజర్ న్యూస్ : పల్నాడు ప్రాంత విద్యాభివృద్ధికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావు అన్నారు. మంగళవారం పిడుగురాళ్ల పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశా లలను, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను కలిసి సమ స్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వెనుక బడిన పల్నాడు ప్రాంత అభివృద్ధికి, విద్యాభివృద్ధికి నిధులు కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తానని ఆయన అన్నారు. అదేవిధంగా అంగన్వాడి వర్కర్స్ ను సందర్శించి వారికి 42 రోజులు సమ్మె సందర్భంగా ప్రభుత్వ ఇచ్చిన హామీలను అమలు కోసం కృషి చేస్తానని ఆయన అన్నారు. సిపిఎస్ రద్దు కోసం, మెగా డీఎస్సీ విడుదల కోసం, గ్రూపు 2 ఉద్యోగాల భర్తీ కోసం కృషి చేస్తానని ఆయన అన్నారు. శాసనమండలికి ఎన్నిక అయితే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ ఆంజనేయులు



నాయక్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, ఐక్య ఉపాధ్యాయ సంఘం మిత్రులు సైక్ కాసిం పీరా, జమాల్, హనుమంతరావు, శ్రీనివాసరావు, సాంబశివరావు, సిఐటియు నాయకులు తెలకపల్లి శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కోటా సాయికుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అంగనవాడి కార్యకర్తలను కలిసి సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు కృషి చేస్తానన్నారు.

## మంగళగిరి ఎయిమ్స్ లో తొలి అవయవదానం

మంగళగిరి, మేజర్ న్యూస్:

గుంటూరు జిల్లా మంగళగిరి లోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్ )ఆసుపత్రిలో బుధ వారం తొలి అవయవ దానం నిర్వ హిం చారు. విజయవాడ భవానిపురం కు చెందిన సరస్వతి (54) అనే మహిళ ఈనెల 14వ తేదీన తాడేపల్లి ప్రాతూరు రోడ్డులో ద్విచక్ర వాహనంపై తన కుమారుడితో కలిసి వెళుతుండగా ప్రమాదవశాత్తు వాహనం అదుపు తప్పి క్రింద పడ్డారు. దీంతో ఆమెకు తలకు బలమైన గాయమైంది. తులత తాడేపల్లిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో ఆమెకు చికిత్సను అందించారు. ఆమె పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం నిమిత్తం అదేరోజు మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ఈనెల



18వ తేదీన సరస్వతికి బ్రెయిన్ డెడ్ గా వైద్యులు, ప్రభుత్వ కమిటీ నిర్ధారిం చింది. సరస్వతి అవయ వాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు రావడంతో కాలేయం, కిడ్నీని మణిపాల్ ఆసుపత్రికి, కళ్లను ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి, మరో కిడ్నీని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న రోగికి అమర్చారు. ఈ మేరకు బుధవారం ఎయిమ్స్ ఆసుపత్రి ఐపీడీ బ్లాక్ వద్ద సరస్వతి భౌతిక కాయానికి ఎయిమ్స్ వైద్యులు, సిబ్బంది ఘనంగా నివాళులు అర్పించారు. ఎయిమ్స్ డైరెక్టర్ అహం దేవ్ శాంతసింగ్ , తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా సరస్వతి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## రాజకీయ లబ్ధి కోసం జగన్ అగచాట్లు

- మిర్చి రైతుల పరామర్శ పేరుతో మరో నాటకం
- మన్నవ మోహనకృష్ణ విమర్శ

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



రైతు సమస్యలపై ఏమాత్రం అవగాహన లేని వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి తన రాజకీయ లబ్ధి కోసం అనేక అగచాట్లు పడుతున్నారని రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ వ్యాఖ్యానించారు. రైతుల్ని రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు, ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రౌడీలు, దొంగలను తీసుకెళ్లి రైతు పరామర్శ పేరుతో గుంటూరు మిర్చియార్డులో జగన్‌రెడ్డి... డ్రామాలు ఆడారని మండిపడ్డారు. యార్డులో వైసీపీ పిల్ల సైకోలు రౌడీల్లా ప్రవర్తించి రైతులు అమ్ముకునేందుకు తీసుకొచ్చిన మిర్చి బస్తాలను సైతం దోచుకోవడం దారుణమన్నారు. వైసీపీ పాలనలో మిర్చి పంటకు నల్ల తామర తెగులు సోకి లక్షల ఎకరాల పంట దెబ్బతిన్నప్పుడు మిర్చి రైతులను జగన్ ఎందుకు రైతులను పరామర్శించలేదని మోహనకృష్ణ నిలదీశారు. 2020-21, 2021-22లో మిర్చి ధరలు పూర్తిగా పతనమైనప్పటికి అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌రెడ్డి పరామర్శించకపోగా చిన్న ప్రకటన కూడా చేయలేదన్నారు. 2017లో మిర్చి రైతులకు అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. 1500 క్వింటాల్‌కు బోనస్‌గా ఇవ్వడం జరిగిందని, వైసీపీ ఐదేళ్ల ఇలా ఒక్కరూపాయి అయినా సాయం చేశారా? చేస్తే ఆధారాలు చూపించాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మార్కెట్ ఇంటర్వేషన్ ఆపరేషన్ కింద ఒక్క రూపాయి కూడా వైసీపీ ప్రభుత్వం కేటాయించలేదన్నారు. ధాన్యం రైతులకు సకాలంలో డబ్బులు ఇవ్వకపోగా, దేశంలో రైతుల ఆత్మహత్యల్లో ఏపీని మూడో స్థానంలో నిలిపారని, కౌలు రైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానానికి తీసుకెళ్లిన ఘనత జగన్‌ది కాదా? అని ప్రశ్నించారు. ప్రజలు ఎంత ఛీ కొట్టినా సిగ్గులేకుండా అబద్ధాలు చెబుతూ రైతుల పట్ల దొంగ ప్రేమను ఒలకబోస్తున్న జగన్‌కు ఈసారి ఆ 11 సీట్లు కూడా ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా లేరని మోహనకృష్ణ పేర్కొన్నారు. రైతులకు చెందిన మిర్చి బస్తాలను దోచుకున్న వారి వివరాలు త్వరలోనే బయటకు వస్తాయని వారిని తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు.

## బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్ రూమ్‌లో కట్టు దిట్టంగా భద్రపరచాలి






**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

- మిగిలిన మెటీరియల్‌లో రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించాలి
- అధికారులకు శిక్షణ తరగతుల నిర్వహణ

ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ముగిసిన తరువాత రిసెప్షన్ కేంద్రానికి ప్రిసైడింగ్ అధికారులు తీసుకువచ్చిన బ్యాలెట్ బాక్స్‌లను, మెటీరియల్ రిసెప్షన్ కేంద్రాలు వద్ద నియమించిన ప్రత్యేక బృందాలు స్ట్రాంగ్ రూంలో సక్రమంగా భద్రపరచాలని రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికలకు సంబంధించి పోలింగ్ మెటీరియల్ భద్రపరిచే స్ట్రాంగ్ రూం వద్ద రిసెప్షన్ కేంద్రంలో విధులు కేటాయించిన అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి , సంయుక్త కలెక్టర్ ఏ భార్గవతేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల పోలింగ్ ముగిసిన తరువాత ఏసి కళాశాలలోని స్ట్రాంగ్ రూంలలో భద్రపరచటానికి ప్రిసైడింగ్ అధికారులు బ్యాలెట్ బాక్స్‌లు, ఇతర పోలింగ్ మెటీరియల్ రిసెప్షన్ కేంద్రానికి తీసుకువస్తారన్నారు. ప్రిసైడింగ్ అధికారుల నుంచి బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ మెటీరీయల్, స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ కవర్లు, ఇతర పోలింగ్ మెటీరీయలు తీసుకోవటానికి, తీసుకున్న వాటిని స్ట్రాంగ్ రూంలో భద్రపరచటానికి పోలింగ్ బూత్ లు వారీగా ప్రత్యేకంగా టీంలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఇతర జిల్లాల రిసెప్షన్ కేంద్రాల నుంచి వచ్చిన పోలింగ్ మెటీరియల్ తీసుకోవటానికి జిల్లాకు ఒక టీంను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ముఖ్యంగా బ్యాలెట్ బాక్స్ లు తీసుకునేటప్పుడు సీల్ పూర్తి స్థాయిలో తనిఖీ నిర్వహించాలన్నారు. అదే విధంగా బ్యాలెట్ పేపర్ అకౌంట్, పీవో డిక్లరేషన్, పీవో డైరీ, పేపర్ సీల్ అకౌంట్ ఫారాల్లోకి ప్రతి కాలమ్ ను పరిశీలించి తీసుకోవాలన్నారు. ప్రిసైడింగ్ అధికారుల నుంచి తీసుకున్న మెటీరీయల్ ఎప్పటికప్పుడు స్ట్రాంగ్ రూం టీంలతో సమన్వయం చేసుకుంటూ పోలింగ్ బూత్ లు వారీగా స్ట్రాంగ్ రూం కు తరలించాలన్నారు. ఇతర జిల్లాల రిసెప్షన్ కేంద్రాల నుంచి వచ్చిన పోలింగ్ మెటీరియల్ ను ఫారాలను, బ్యాలెట్ బాక్స్ సీళ్ళను పరిశీలించి స్ట్రాంగ్ రూం కు చేర్చాలన్నారు. కౌంటింగ్ సజావుగా కొనసాగాలంటే రిసెప్షన్ కేంద్రాల్లో పోలింగ్ మెటీరియల్ తీసుకునేటప్పుడే నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం అన్ని సరిచూసుకొని స్ట్రాంగ్ రూం కు తరలించేలా అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించా లన్నారు. సమావేశంలో రిసెప్షన్ కేంద్రాలు వద్ద పోలింగ్ సామగ్రి తీసుకునే అధికారులు పరిశీలించాల్సిన ఫారాలు, వాటి వివరాలను మాస్టర్ ట్రైనర్స్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమగ్రంగా శిక్షణ ఇచ్చారు. సమావేశంలో డీటీసీ కె. సీతారామిరెడ్డి, డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ రవికాంత్, రిసెప్షన్ కేంద్రాలు వద్ద విధులు కేటాయించిన డిప్యూటీ తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.


విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య

అక్షరానికి నైతికతను అద్ది దేశవ్యాప్తంగా 23 ఎడిషన్లతో సామాజిక న్యాయం వైపు మళ్ళించే యజ్ఞం "నేటి దినపత్రిక సూర్య" చేపట్టింది, అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ యజ్ఞంలో "నేటి దినపత్రిక సూర్య" అక్షర సైనికులను మరి కొంత మందిని నియమించుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్నాడు, గుంటూరు జిల్లాలలో ఖాళీగా ఉన్న మండలాలకు విలేకరులకు నియమించుకోవదలిచాము. కావలెను. ఆసక్తిగల వారు ఈ క్రింది మండలాలకు ఈ నెల 31వ తేదీలోగా ఇంటర్వ్యూకి ఈ క్రింది అడ్రస్సులో సంప్రదించగలరు.

1.తాడికొండ, 2. తుళ్ళూరు, 3. మేడికొండూరు, 4. ఫిరంగిపురం, 5. ప్రత్తిపాడు, 6. పెదనందిపాడు, 7. కాకుమాను, 8.వట్టిచెరుకూరు, 9.అమరావతి, 10.గుంటూరు రూరల్, 11.గుంటూరు జిల్లాపరిషత్, 12. దాచేపల్లి, 13. బొల్లాపలి, 14. పెదకూరపాడు, 15. పొన్నూరు

పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777

జిల్లా ఇన్‌చార్జిలు: జి.శ్రీనివాసరావు సెల్ : 9959426987 ఆర్.డి.నాయక్ సెల్ : 8897455466

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతీయ కార్యాలయం, 9/1, అరండల్‌పేట, గుంటూరు.



నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు

సూర్య www.suryaa.com

"నేటి దినపత్రి సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు, ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు. సరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును. మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

- పి. బాలు (చిన కొండయ్య) — బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777
- జి.శ్రీనివాసరావు — గుంటూరు జిల్లా ఇన్‌చార్జి సెల్ : 9959426987
- వి.వెంకటరెడ్డి — బొల్లాపల్లి రిపోర్టర్ సెల్ : 80191 99991
- ఆర్.ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి.) — స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా. సెల్ : 8897455466
- జి.హిరన్మాయి (కన్నల్) — నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి జిల్లా క్రైమ్ రిపోర్టర్
- చెట్టిపోగు కాశి — దాచేపల్లి రిపోర్టర్ సెల్ : 9963343327
- శేషగిరి రాజు — మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 8341408201
- వై.ఏసుబాబు — గురజాల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 9701250872
- బి.పూర్ణచంద్రరావు — సత్తెనపల్లి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9866246951
- చెవుల రంగారావు — మెడికల్ రిపోర్టర్, గుంటూరు సెల్ : 9490544635
- యం.కృష్ణ — మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9393309149
- వి.రవికుమార్ — తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 99083 38200
- డి. చైతన్య — వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9381968453
- వి.లూథర్ — నరసరావుపేట రిపోర్టర్ సెల్ : 7799382078
- జి.ఏలియా — ముప్పాళ్ళ రిపోర్టర్ సెల్ : 9392231959
- బి.సాంబశివరావు — రాజుపాలెం రిపోర్టర్ సెల్ : 9949382676
- రమేష్ — దుగ్గిరాల రిపోర్టర్ సెల్ : 9866782780
- ఎస్.వెంకటేశ్వర్లు — పెదకాకాని రిపోర్టర్ సెల్ : 9948175840
- కె.నాగరాజు — రిపోర్టర్, గుంటూరు సెల్ : 7799881000
- డి.రమేష్ — ఈపూరు రిపోర్టర్ సెల్ : 9110734898
- పి.లక్ష్మీనారాయణ — నూజెండ్ల రిపోర్టర్ సెల్ : 9666474953
- ఎస్.కె. రవూఫ్ — శావల్యాపురం రిపోర్టర్ సెల్ : 7989434737
- అక్కిరెడ్డి — నరసరావుపేట మెడికల్ రిపోర్టర్ సెల్ : 9849134987
- బి.గురవయ్య — వినుకొండ క్రైం రిపోర్టర్ సెల్ : 9908340426
- వి.లక్ష్మీనారాయణ — రెంటచింతల రిపోర్టర్ సెల్ : 8500079075
- పి.వెంకటేశ్వర్లు — దుర్గి రిపోర్టర్ సెల్ : 8185815858
- టి.శ్రీకాంత్ — వెల్దుర్తి రిపోర్టర్ సెల్ : 9912818723
- పి.మణికంఠ — మాచర్లటౌన్ రిపోర్టర్ సెల్ : 7013169885
- ఎస్.డి.మహబూబ్ — మాచర్ల క్రైం రిపోర్టర్ సెల్ : 9989124898
- ఎం.కోటేశ్వరరావు — మాచవరం రిపోర్టర్ సెల్ : 6303775169
- డి.మల్లికార్జునరావు — యడ్లపాడు రిపోర్టర్ సెల్ : 8309237441
- రమేష్ — క్రోసూరు రిపోర్టర్ సెల్ : 9493148828
- ఎస్.విజయభాస్కర్ — గుంటూరు రిపోర్టర్ సెల్ : 9440822538
- షేక్ నాగూర్ — నకరికల్లు రిపోర్టర్ సెల్ : 98489 26300
- పి.ఆనంద్ — వినుకొండ రూరల్ రిపోర్టర్ సెల్ : 8125125239
- నాగరాజు — మంగళగిరి టౌన్ రిపోర్టర్ సెల్ : 9032258913
- రమేష్ — నరసరావుపేట రూరల్ రిపోర్టర్ సెల్ : 7075942600

"నేటి దినపత్రిక సూర్య" ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం. 9/1, అరండల్‌పేట, గుంటూరు.